### గర్జించిన ఆలేరు..

ఆలేరు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వద్ద రుణమాఫీపై నిర్వహించిన ధర్నాకు నియోజకవర్గానికి చెందిన రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జై కేసీఆర్..రైవంత్‌రెడ్డి డౌన్ డౌన్..షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక సర్కార్ కాంగ్రెస్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రైతులందరికీ రుణమాఫీ చేయాలి : మాజీ ప్రభుత్వవిప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి

డిసెంబర్ 9న మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి ఊకదంపుడు ఉపన్యాసాలు చేసి రైతులను మోసం చేశారని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి విమర్శించారు. లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా ఆగస్టు 15లోగా మాఫీ చేస్తామని ఒట్టు వేసి, మాట తప్పారని, అందుకే గుట్టలో పాప పరిహారం చేశామని పేర్కొన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని, లేకుంటే రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.


నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శుక్రవారం 23 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI




తిరుమలగిరిలో బీఆర్ఎస్ ధర్నా శిబిరంపై రాళ్లు రువ్వుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

# రేవంత్‌రెడ్డీ.. రుణమాఫీపై రుజువు చెయ్

## ఒక్క ఊళ్లో అయినా వంద శాతం అయినట్లు నిరూపించు

- ఏ గ్రామానికి వెళ్దామో నువ్వే సెలెక్ట్ చేసుకో.. నేను రెడీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్
- ఆలేరులో రుణమాఫీపై రైతులతో కలిసి ధర్నా
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు
- రుణమాఫీ చేసే వరకూ వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ





రుణమాఫీపై ఆలేరు పట్టణంలో రైతులతో కలిసి నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నేతలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 22 : 'ఆలేరు నియోజకవర్గంలో ఏ ఊరుకైనా వెళ్దాం.. దమ్ముంటే వంద శాతం రుణమాఫీ జరిగిందని రుజువు చెయ్' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సవాల్ విసిరారు. 'ఏ గ్రామం వెళ్దామో నువ్వే ఎంపిక చేసుకో.. నేను రెడీ' అని స్పష్టం చేశారు. ఆలేరు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతుల రుణ మాఫీ కోసం బీఆర్ఎస్ పార్టీ బుధ వారం తలపెట్టిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. రైతు భరోసా ఊసేలేదని, రుణమాఫీ ఆగమాగమని, వడ్లకు బోనస్ బోగస్‌గానే మారిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అంటూ బాండ్ పేపర్లు చేతబట్టుకుని కాళ్లుచేతులు పట్టుకుని ఓట్లడిగిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు కాలయాపన చేస్తూ ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ఆరు గ్యారంటీల అమలు, రైతుకు రుణమాఫీ ఏమైందని పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఊరూరా వీడియోలను ప్రదర్శించి ఎక్కడికక్కడ నిలదీశామని తెలిపారు. దాంతో ప్రజలు ఇక కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టు పెట్టే కార్యక్రమం పెట్టుకున్నారని గుర్తు చేశారు. భువనగిరి సభలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టుపెట్టి ఏదేమైనా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చాడో, లేదో రైతులు సమాధానం చెప్పాలన్నారు. ఇప్పుడేమైందో రైతులు ఆలోచన చేయాలని కోరారు. ఏ ఊరికి వెళ్లినా 40 శాతం మాత్రమే రుణమాఫీ జరిగిందని, రైతులు వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని చెప్పారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులది ఒక్కొక్కరిది ఒక మాట అన్నారు. అబద్ధాలు చెప్పి గోల్‌మాల్ చేసి రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గతేడాది కొండపోచమ్మసాగర్ నుంచి చెరువులకు గోదావరి జలాలు విడుదల చేశామని, ఈసారి కొండపోచమ్మ సాగర్ నుంచి నీళ్లు ఎందుకు విడుదల చేయడం లేదో చెప్పాలన్నారు. నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా అన్ని చెరువులకు నీళ్లివ్వాలన్నారు. రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. అటు అసెంబ్లీలో, ఇటు ప్రజాక్షేత్రంలో పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవనేని కృష్ణారావు, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, కల్లూరి రామచంద్రారెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్‌గౌడ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, గంగుల శ్రీనివాస్, పాపట్ల నరహరి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకర్, మొరిగాడి వెంకటేశ్, వంటేరు సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 40 శాతం మందికే రుణ మాఫీ : మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

ఏ గ్రామం వెళ్లినా మాకు రాలేదు, మాకు రాలేదని రైతులంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, కేవలం 40 శాతం మందికే రుణమాఫీ చేస్తారా? అని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. సాంకేతిక అంశాల ఆధారంగా రుణమాఫీ జరుగలేదని సాకులు చెబుతున్నారని, రుణమాఫీ ఎగ్గొట్టేందుకు ఇలా చెబుతున్నారని తెలిపారు.

### కపటనాటక సూత్రధారి రేవంత్‌రెడ్డి : ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

రేవంత్‌రెడ్డి అంటే కుచితం, కుతంత్రం, కటిలం, కపటం. ముఖ్యమంత్రి కపట నాటక సూత్రధారి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో చంద్రబాబు నాయుడిని నిలదీయండని అప్పటి జేఏసీ చైర్మన్ కోదండరాంరెడ్డి పిలుపునిస్తే.. ఎవ్వడురా నా చంద్రబాబు నాయుడిని నిలదీసేది.. ఆయన నీడను తాకినా ఊరుకోను అంటూ రైఫిల్ పట్టుకుని కాల్చి పారేస్తానంటూ తిరిగిన ఘనుడు రేవంత్‌రెడ్డి. పసికందుగా ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టడానికి డబ్బు సంచులతో బేరాలకు దిగితే హరీశ్‌రావు రెడ్‌హ్యాండడ్‌గా పట్టుకున్నాడు.. అందుకే రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు అంటే భయం. రేవంత్ ఇప్పుడు రాష్ట్ర గీతం చేస్తే ఆ గీతాన్ని ఎప్పుడో తెలంగాణ రాష్ట్రమంతా పాడింది. ఆ గీతాన్ని పాడని గొంతు ఉందంటే అది రేవంత్‌రెడ్డి గొంతే. ప్రజా పాలన అనే రంగు వేసుకుని పౌర హక్కులను కాపాడుతామని చెప్పి మోసం చేశారు. ప్రజా పాలనలో నిరసనలు చేసుకునే వీలుందని నమ్మబలికి ఎక్కడిక్కడ లాఠీ చార్జీలు చేస్తున్నారు. ధర్నాలు చేసే రైతులకు నోటీసులు జారీ చేస్తున్నారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి రైతులను మోసం చేసిన రేవంత్‌రెడ్డికి రైతన్నలు బుద్ధి చెప్పాలి.

# రైతు శిబిరంపై కాంగ్రెస్ దౌర్జన్యకాండ

- రైతన్నకు అండగా నిలిచిన బీఆర్ఎస్ శ్రేణులపై మూకదాడి
- రుణమాఫీ రాలేదని ధర్నాకు దిగితే గూండాయిజం
- కర్రలు, రాళ్లు, గుడ్లతో గంటపాటు విధ్వంసం
- బీఆర్ఎస్ నాయకులకు గాయాలు.. కారు అద్దాలు ధ్వంసం
- భయభ్రాంతులకు గురైన జనం

సూర్యాపేట, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ)/తిరుమలగిరి/అర్వపల్లి, ఆగస్టు 22 : రుణమాఫీ చేస్తామని నమ్మించి ఎన్నికల్లో రైతన్నల ఓట్లు వేయించుకొని లబ్ధి పొందిన కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అన్నదాతపై కన్నెర్ర చేస్తున్నది. ఆగస్టు 15 నాటికి షరతుల్లేకుండా 2లక్షల రుణం మాఫీ చేస్తామని కోట్రీల మీద కోట్రీలు పెట్టి సగం మందికి కూడా మాఫీ చెయ్యకపోగా కనీసం కారణం కూడా చెప్పని దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకుల చుట్టూ, వ్యవసాయాధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకునేవారు లేక విసుగెత్తి పోతున్న బాధిత రైతాంగం పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలబడింది. రుణమాఫీ రాని రైతులతో కలిసి గురువారం ధర్నాలకు దిగింది. అది తట్టుకోలేకపోయిన కాంగ్రెస్ తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో బీఆర్ఎస్ రైతు ధర్నా శిబిరంపై మూకదాడికి దిగింది. రుణమాఫీ డిమాండ్‌తో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్‌తోపాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, రైతులు తెలంగాణ చౌరస్తాలో శాంతియుతంగా ధర్నా చేస్తుండగా.. కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారి కర్రలు, రాళ్లు, కోడిగుడ్లతో మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. టెంట్లు కూల్చి కుర్చీలు ధ్వంసం చేశారు. బీఆర్ఎస్ నాయకులను గాయపర్చారు. కారు అద్దాలను ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడంతో గంటపాటు వారు బీభత్సం సృష్టించారు. ప్రయాణికులు, ప్రజలు సైతం తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సుల్లో వెళ్తున్న వారిపైనా కాంగ్రెస్ శ్రేణులు రాళ్లు రువ్వడం గమనార్హం. కొంత సమయానికి గానీ పోలీసులు పరిస్థితిని చక్కదిద్దలేదు.

### కావాలనే కాంగ్రెస్ గొడవ

రుణమాఫీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు తిరుమలగిరి తెలంగాణ చౌరస్తాలో ఆ పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కావాలనే ఘర్షణకు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం అంటూ అక్కడే కార్యక్రమం నిర్వహించారు. అదే అదునుగా ధర్నా శిబిరంపై దాడులకు దిగారు. బీఆర్ఎస్ ధర్నా శిబిరం కొనసాగుతున్న సమయంలో అదే ప్రదేశంలో పోలీసులు కాంగ్రెస్ శ్రేణుల కార్యక్రమానికి ఎలా అనుమతి ఇచ్చారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ శాంతియుత ధర్నాను విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్ కుట్రపూరితంగా దాడికి దిగినట్లు స్పష్టమవుతున్నదంటున్నారు.

### గాయపడిన వారిని పరామర్శించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

కాంగ్రెస్ దాడిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన పెరుమాళ్ల రాజేశ్‌కు ఛాతి, ఎడమ చేయికి బలంగా గాయాలయ్యాయి. తుంగతుర్తి మండలం బండరామారం గ్రామానికి పొదిల అంజయ్య, శాలిగౌరారం మండలం వంగమర్తికి చెందిన శంకర్‌కు దెబ్బలు తగిలాయి. వారికి స్థానిక ప్రైవేట్ దవాఖానలో వైద్యం అందిస్తున్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ వారిని పరామర్శించారు.

### జగదీశ్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

గాయపడిన బీఆర్ఎస్ నాయకులను పరామర్శించడానికి సూర్యాపేట నుంచి తిరుమలగిరికి బయల్దేరిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ కారును అర్వపల్లి మండలం తిమ్మాపురం స్టేజీ వద్ద డీఎస్పీ రవి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శించి వారిలో మనో ధైర్యం నింపడానికి వెళ్తున్నానని జగదీశ్‌రెడ్డి చెప్పినా వినకుండా నిలువరించారు. దాంతో చట్టానికి మించి అతీతంగా పోలీసులు పని చేస్తున్నట్లుగా ఉందని, తాము కూడా 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నామని, అది మర్చిపోవద్దని, ఇలా అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని గుంటకండ్ల హెచ్చరించారు. దాదాపు 15నిమిషాల పాటు జనగాం-సూర్యాపేట ఎన్‌హెచ్ 365బీ జాతీయ రహదారిపై జగదీశ్‌రెడ్డి వాహనంలోనే ఉన్నారు. అనంతరం తిరుమలగిరికి చేరుకున్నారు. డీఎస్పీ వెంట విధుల్లో సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, అర్వపల్లి ఎస్ఐ బాలకృష్ణ, మోతె ఎస్ఐ యాదవరెడ్డి ఉన్నారు.

## దాడులు చేస్తే ఊరుకునేది లేదు

- చిల్లర వ్యవహారాలకు భయపడం
- దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకులపై దాడికి దిగిన కాంగ్రెస్ గూండాలను వెంట నే అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిజాం నవాబును తరిమికొట్టిన చరిత్ర తుంగతుర్తి గడ్డకు ఉందని, ఇక్కడ బయపడేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు. రైతాంగం తరపున ప్రశ్నిస్తే దాడులు చేస్తామంటే దేనికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. టెంటును తొలగించే క్రమంలో ప్రోత్సహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఇలాంటి దాడులు ఎన్నో చూశామని, జైళ్లకు కూడా వెళ్లామని, ఈ చిల్లర వ్యవహారాలకు భయపడబోమని తేల్చిచెప్పారు. రైతులతో పెట్టుకున్న రేవంత్‌రెడ్డి పతనం ఇక్కడి నుంచే మొదలు అవుతుందని హెచ్చరించారు.

### బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి దాడులున్నాయా ? : మాజీ ఎమ్మెల్యే కిశోర్

కాంగ్రె మాదిరి బీఆర్ఎస్ చిల్లర రాజకీయం చేయదని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. రైతుల సంక్షేమం కోసం పోరాటం చేస్తామని తెలిపారు. పది సంవత్సరాలు పాలించిన తాము ఇలాంటి దాడులు చేస్తే ఒక్కరు కూడా మిగిలేవారు కాదన్నారు. రైతు రుణమాఫీపై మంత్రులకే స్పష్టత లేదని, ఒక్కొక్కరు ఒక రకంగా మాట్లాడుతున్నారని, రైతాంగాన్ని మోసం చేస్తామంటే ఊరుకునేది లేదని చెప్పారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చీరేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలన్నారు.


# దద్దరిల్లిన బీఆర్ఎస్ రైతు ధర్నాలు

## రుణమాఫీ కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసనల వెల్లువ


- పెద్దఎత్తున కదలివచ్చిన రైతాంగం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు దీక్షా శిబిరాల్లోనే..
- సూర్యాపేటలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- ఆలేరులో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు
- ఎక్కడికక్కడ ముందుండి పాల్గొన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు



సూర్యాపేట, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయకపోవడాన్ని నిరసిస్తూ రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆందోళనకు దిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో రైతులతో కలిసి ధర్నాకు దిగింది. రైతులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ రూపాల్లో నిరసన తెలుపుతూ కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ధర్నాలు సాయంత్రం మూడు గంటల వరకు సాగాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ వద్ద చేపట్టిన ధర్నాలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బూడి భిక్షమయ్యగౌడ్ పాల్గొన్నారు. భువనగిరి ధర్నాలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి పట్టణంలో మాజీ ఎమ్మెలే గాదరి కిశోర్, కోదాడలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, నాగార్జునసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు, దేవరకొండలో బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో పెద్దఎత్తున ధర్నాలు చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆర్డీఓ, తాసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందించారు. సర్కారు రుణమాఫీ చెయ్యకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సూర్యాపేటలో రుణమాఫీ ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ నేతలు, రైతులు



భువనగిరిలో రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు



## రైతుల పక్షాన పోరాటం ఉధృతం

- చెయ్యని మాఫీకి కాంగ్రెస్ ఆడంబరాలు
- దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మోసం చేసిన రేవంత్‌రెడ్డి
- షరతుల్లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిందే
- సూర్యాపేట రైతు ధర్నాలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 22 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని, అప్పటివరకూ వదలిపెట్టేది లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తామన్న 49 వేల కోట్ల రుణమాఫీని పూర్తి స్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయకుండానే చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఆడంబరాలు చేస్తున్నదని, దేవుళ్ల మీద ఒట్టుపెట్టి రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశాడని మండిపడ్డారు. ఆ హామీని గుర్తు చేసేందుకే రైతుల పక్షాన బీఆర్ఎస్ ధర్నాకు దిగిందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయలేకనే బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నదన్నారు. ప్రజలను బహిరంగంగా మోసం చేసిన ప్రభుత్వం రేవంత్ సర్కారు తప్ప ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఎన్ని దాడులు చేసినా రైతు పక్షపాతిగా అన్నదాతకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. రుణమాఫీ ఎంత చేశారో చెప్పడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మొదట రూ.49వేల కోట్లు అని, అనంతరం 41వేల కోట్లని చెప్పి 36కు తెచ్చారని, ఆపై 31వేలు కోట్లంటూ నిర్ణయించామన్నారని విమర్శించారు. వారి లెక్కలు వేలం పాట లెక్కనే ఉందని ఎద్దేవా చేశారు. దేవుళ్ల మీద ఒట్టువేసి దేవుళ్లను సైతం మోసం చేసిన నాయకుడు రేవంత్‌రెడ్డి అన్నారు. హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ ను నిద్రపోనిచ్చేది లేదన్నారు. ప్రతిపక్షంగా ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్, రైతు సంఘాల నాయకులు గండూరి ప్రకాశ్, ఉప్పల ఆనంద్, పుట్ట కిశోర్, కక్కిరేణి నాగయ్యగౌడ్, సవరాల సత్యనారాయణ, బూరబాల సైదులు, నెమ్మాది భిక్షం, మారిపెద్ది శ్రీనివాస్, తూడి నర్సింహా రావు, తాహెర్ పాష, కరుణ శ్రీ, జూలకంటి జీవన్ రెడ్డి, మహేశ్వరి, మామిడి అంజయ్య, బిట్టు నాగేశ్వర్ రావు, వంగాల అంజయ్య పాల్గొన్నారు.